# వికలము కూడా సుఖమే కాదా....

బుద్ధరాజు సన్యాసిరాజు



కరెక్ట్ టైముకే వచ్చి, స్టేషన్ వదిలేసిన ట్రైఉను కసిదీరా బూతులు తిడుతున్నాడు కాశి...

"కన్నతల్లిని తిడితే కడుపు నిండదురా యదవా ... ఒళ్ళు బలిసి నువ్వు టైముకి స్టేషన్‌కి రాలేకపోతే, అది దాని తప్పేటి ?" అని కోప్పడ్డాడు పైడి.

పైడి కుంటివాడు — కుడికాలు తొడ వరకూ లేదు.

కాశికి ప్రపంచజ్ఞానం బోధించిన గురువు.

"ఎవురూ ... కాశిగాడేనా ? ... గతిలేని యెద్దు గానుగు లాగిందనీ ... ఈ వాడికి అడుక్కుతినే కర్మ పట్టింది గాని, ఏ వాడైనా కట్టపడి యెరుగునా, పాపం..." అన్నాడు, పదాది క్రితం వరకూ అందర్నీ చూడగలిగే ప్రయోజనంలేక, దూపు పాడు చేసుకున్న పింకటేసు.

ఆ మాటలకు చలించాడు కాశి...

పింకటేసు చెప్పింది అక్షరాలా నిజం... గతం కళ్ళముందు కదిలింది కాశికి.

* * *

కాశి తండ్రి కళాసీగా వుండేవాడు, స్టేషన్లో.

తల్లి లేదు, అక్కయ్య వుండేది...

స్టేషనుకు దగ్గర్లో ఓ చిన్న పాకలో వుండేవాళ్ళు.

అక్కయ్య తండ్రికి భోజనం తీసుకెళ్తుండేది ...

స్కూలు లేనప్పుడు తనూ వెళ్ళేవాడు, అక్కతో.

ఆహ్ — ఆ రోజులు తల్చుకొంటుంటే ఎంత ఆనందంగా వుంది !

'చిన్నదొర' అని పిలిపించుకొనే అసిస్టెంటు స్టేషన్ మాస్టరు తనను దగ్గరకు పిల్చి కూర్చోబెట్టుకుని, చాక్లెట్లు తెప్పించేవాడు ...

ఒకళ్ళిద్దరు టి. టి. ఈ లు బుగ్గలు దిదిమి టిఫిను, టీ తెప్పించి యిచ్చేవాళ్ళు...

అక్క చూసీ చూడనట్టు ఊరుకునేది...

వాళ్ళు అప్పుడప్పుడు అక్కతో ఏదో మాట్లాడుతుండేవాళ్ళు మెల్లగా...

తనని గురించే అక్కకి చెప్తున్నారనుకుని సిగ్గుతో మొహం దించేసుకునే వాడు తను...

ఆ రోజు తనింకా మర్చిపోలేదు...

అప్పుడు తను ఏడోతరగతి చదివేవాడు, హైస్కూల్లో...

అక్క, తనూ నాన్నకి భోజనం పట్టు కెళ్ళారు.

కాని నాన్న స్టేషన్లో లేడు...

ఇంతలో లైన్‌మేన్ చిన్నయ్య పరుగెత్తుకుంటూ వచ్చి, నాన్న రైలు పట్టాల మధ్య చచ్చిపోయి ఉన్నాడని చెప్పాడు.

స్టేషన్లో ఉన్న కళాసీలు, పోలీసులు వెళ్లి

నాన్న శవాన్ని తీసుకొచ్చి స్టేషన్లో పెట్టారు ..

అక్కా, తనూ ఆ రోజు నాన్న శవం మీద పడి ఏడ్చారు—అక్కకూ, తనకూ ఏ దారీ లేదు

ఓ రోజు చిన్నదొర ఓ కళాసీతో కబురు పెట్టాడు, అక్కను రమ్మని

కొంతమందికి కేరేజీలు తెచ్చేపనికి కుదిర్చాడు, అక్కని.

రోజులు మామూలుగా గడిచేవి...

ఓ రోజు తనకి డబ్బులిచ్చి సినిమా చూసి రమ్మంది అక్క

దాన్ని కూడా రమ్మంటే తలనొప్పిగా ఉందని చెప్పింది.

సినిమా హాల్లోదూరి, జనాన్ని తోసుకుని టిక్కెట్టిచ్చే దగ్గరికి వెళ్తుంటే, టోపీ వేసుకున్నాయన పట్టుకుని 'కేడీ నా కొ...' అని తిట్టి, తన దగ్గరున్న చిల్లర లాక్కుని, కొట్టి బయటకి తోసేసాడు ...

ఏడ్చుకుంటూ ఇంటి కొచ్చేసాడు ...

రెండు మూడు సార్లు గుడిసె తలుపు కొట్టినా, అక్క తియ్యలేదు...

బాగా నిద్రపట్టేసిందేమో అనుకున్నాడు ...

మరో రెండుసార్లు గట్టిగా బాది, పిలిచాడు...

కొంతసేపటి తరవాత తలుపు తీసింది, అక్క ...

చిన్నదొర గాబరాగా బయటికి వెళ్ళిపోయాడు, గుడిశెలోనుంచి...

తనను చూసి అక్క గాబరా పడింది ... ఏవ్వుడూలేంది చిరాగ్గా చూసింది తనకేసి.

రెండు మూడు నెలల తరవాత ఓ రోజు అక్కనీ, తననీ బయటి కీడ్చి, గుడిశె పడగొట్టేసారు, చుట్టుప్రక్కల వాళ్ళు.

ఎందుకలా చేసారో అప్పుడర్థం కాలేదు, తనకి.

తరవాత స్టేషనే యిల్లయింది-అక్కకు, తనకూ.

ఒక ఉదయం తను నిద్రలేచేసరికి అక్క లేదు.

అందరూ తనని అదోరకంగా చూడటం మొదలెట్టారు ...

ఓ రోజు స్టేషన్లో తిరుగుతుంటే పైడి జాలిపడి, ఈ సలహా యిచ్చాడు.

ఆ రోజు నుంచీ తను అడుక్కుంటు న్నాడు.

* * *

"నీ గురించి నర్సింగు గోర్ని కనుక్కున్నానురా... సంగంలో చేర్చుకోడానికి కుదరదనీసారు..."

అన్నాడు పైడి కాశితో, బాధగా.

తను కట్టుకున్న గాలిమేడలు కూలిపోయాయి...

పట్టుకుందామనుకున్న కొమ్మ చేతి కందలేదు...

సంగంలో చేరిపోతే ఏ యిబ్బందీ ఉండదనుకున్నాడు... చేరమని పైడే సలహా యిచ్చాడు.

సంగం పెద్ద 'నర్సింగు' గారట. ఆయనా మొదట్లో స్టేషన్లో అడుక్కునే వారట. తరవాత్తరవాత స్టేషన్లో ఓ అందమైన పిచ్చిదాన్ని చేరదీసి, నలుగురికీ దాన్ని రుచి చూపించి, నాలుగు డబ్బులు వెనకేసి అడుక్కోటం మానేసారట...

చనువున్న వాళ్ళెవరైనా 'ఒరే నర్సింగూ' అంటే, వాళ్ళని కొట్టినంత పని చేసేవారట.

నెమ్మది నెమ్మదిగా, స్టేషన్లో అడుక్కునే వాళ్ళమీద జులుం చేసి, ఒక్కొక్కడి దగ్గరా రోజుకో పది పైసలు చొప్పున వసూలుచేసి, ఒక సంగం పెట్టారట...

ఇప్పుడాయన మూడు రిక్షాలకి ఓనరట!

కాని, నర్సింగు గారిలో ఒక గొప్ప గుణం వుందట... సంగంలోని వాళ్ళకి అన్యాయం చెయ్యరట...

ఇప్పుడు సిటీలో వున్న అన్ని సంగాలకన్నా నర్సింగు గారి సంగమే పెద్దదట.

సంగంలో చేరిన వాళ్ళ దగ్గర నుంచి రోజుకు రెండురూపాయల చొప్పున వసూలు చేస్తారట...

ఉదయం డూటీకి వెళ్ళే ముందు నాలుగు ఇడ్లీ, టీ యిస్తారట...

మళ్ళీ రాత్రికి భోజనం...

పడకలకోసం ఫుట్‌పాత్‌లమీది సిమ్మెంట్ పలకలు కేటాయిస్తారట...

సిటీలో ఎక్కడికి కావాలంటే అక్కడికి బదిలీ చేయించుకోవచ్చుటకాని, అక్కడి వాడు ఈ ఖాళీకి రావడానికి ఒప్పుకోవాలట.

రైల్వేస్టేషను,బస్టాండులాటి సెంటర్లకు బదిలీలు కావటం చాలా చాలా కష్టం అట!

ఈ విషయాలన్నీ తనకు పైడే చెప్పాడు.

'తంతే బూర్ల గంపలో పడినట్టు, స్టేషన్లోనే డూటీ దొరకడం నీ అదృష్టంరా కాశీ...'... అని పైడే అన్నాడు.


సంగంలో తొందరగా చేరకపోతే స్టేషన్లో గాని, మరెక్కడయినా గాని డ్యూటీ చెయ్యనీరని కూడా పైడి చెప్పాడు.

కాని తనని చేర్చుకోనంటున్నారని కూడా చెప్పాడు పైడి

ఎందుకు చేర్చుకోరో అర్థం కాలేదు, కాశికి...

అదే అడిగాడు పైడిని...

"ఆడేటన్నాడు గుడ్డోడా, కుంటోడా?... అడ్డమైన వోళ్ళందర్నీ సంగంలో చేర్చు



**Good News! JUST RELISED**

**GUIDE-CUM-TEST PAPERS**
**1982 Editions**

Sai Made Easy Series
INTER MEDIATE ENGLISH MEDIUM

*R. CHALAPATHI RAO'S*
JUNIOR PHYSICS Rs 14-00
SENIOR PHYSICS Rs 14-00

**namaste books**
VIJAYAWADA-520 002 • PHONE 74645
NO V.P.P. SYSTEM
POSTAGE FREE FOR PRE-PAID ORDERS









నూతన యవ్వనం పొందండి. సంతానవంతులు కండి! చర్మ వ్యాధుల నుండి విముక్తులు కండి. హస్తప్రయోగము వలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్కలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స. పోస్టు ద్వారా చికిత్స కలదు. ప్రతి ఆదివారము భీమవరం షణ్ముఖ లాడ్జి నందు ఉ. 9 నుండి సా. 6-30 వరకు క్యాంపు కలదు.

**డా॥ డి. మార్కండేయులు**
ఆయుర్వేద భిషక్,
సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్టు,
పోర్కు రోడ్డు, గుడివాడ-521301,
ఫోన్స్ 522 & 540


## వికలము కూడా సుఖమే కాదా

కుంటే నా సంగం స్వతంత్రమై పోదూ..." అన్నాడట వర్సింగు గారు.

అదీ నిజమే అనిపించింది కాశికి

విధిలేక దొంగతనంగా అడుక్కుంటు న్నాడు కాశి, స్టేషన్లో.

*        *        *

ఆ రోజు రావల్సిన రైలు రెండు గంటలు లేటట.

ప్రయాణీకుల ముఖాలు ముడుచుకున్నాయి...

ముష్టివాళ్ల ముఖాలు వికసించాయి!

ఒకడు చెడితేగాని ఇంకొకడు బాగుపడడన్న సిద్ధాంతం ఇక్కడా వర్తిస్తుందేమో...

ప్రయాణీకుల్లో హడావుడి తగ్గి, ఖాళీ ఉన్న దగ్గరల్లా చతికిలబడుతున్నారు.

ప్రపంచంమీద చర్చ సాగులోంది, స్టేషన్లో.

'అమెరికాలోని ట్రెయిన్లకి లేటంటే ఏమిటో తెలియ'దంటున్నాడు ఒకడు...

'రష్యాలో లేటొచ్చిన ట్రెయిన్ని ఉరి తీసేస్తా'రంటున్నాడు ఇంకొకడు ప్రపంచ జ్ఞానినని ఫీలవుతూ.

చుట్టూవున్న 'జ్ఞానశూన్య' అవార్డు గ్రహీతలు నోళ్లు వెళ్లబెట్టి వింటున్నారు.

వాళ్లని చేరాడు కాశి.

"బాబూ ధర్మం..."

ఎవరికీ ఏకాగత చెడలేదు.

"ధర్మ ప్రభువులు... కనికరించాలి"

ఆత్మాభిమాన్ని జయించిన కర్తవ్యం నేర్పిన సంబోధన అది.

"దున్నపోతులాగున్నావ్... ఏదైనా పని చేసుకోరాదూ."

అన్నాడొకాయన చీకికళ్ల మొహం చిట్లించి.

"ఇలాంటి వెధవలంతా పగలు అడుక్కునే పని, రాత్రి బ్రోకరు పని..." ఇంకొకాయన.

"మన దేశంలో శ్రమలేని ఉద్యోగాలివే... కొన్నాళ్లకి దేశమంతా అడుక్కుతినేవాళ్లే అయినా ఆశ్చర్యపోనక్కర్లేదు."

అన్నాడు ఖద్దరు బట్టల గారవళ్ల శాస్త్రి, జోకేసినట్టు.

మొదటి 'ఒకాయనా', 'ఇంకొకాయనా' ప్లాట్‌ఫాం మీద దొర్లి దొర్లి నవ్వారు ఆ కుళ్లు జోకుకి.

> **రచయిత్రుల పోస్టాఫీసు !**
>
> పశ్చిమ జర్మనీలో ముగ్గురు మహిళలు కలిసి "రచయితల పోస్టాఫీసు" ప్రారంభించారు. పోస్టాఫీసంటే కార్డు, కవర్లు అమ్మే కార్యాలయం కాదు అది ప్రచురణకర్తలకు, చెత్త బుట్టకు మధ్య వారధి. సాహిత్యం అంగట్లో అమ్మే సరుకు కాదని వీరి అభిప్రాయం. కొత్త రచయితలను వెలుగులోకి తీసుకురావడం, పుస్తక ప్రచురణ వీరి ధ్యేయం కాదు పుస్తక ప్రచురణకు ప్రత్యామ్నాయం కాగలగటమే వీరి ధ్యేయం. ఔత్సాహికులైన రచయితలు తమ రచనలను ఇక్కడ చదివి వినిపిస్తారు. వాటిని గురించి చర్చిస్తారు. స్వయంగా రాలేక పోతే రచనలు పోస్టులో పంపవచ్చు వాటి ప్రతులను పాఠకులకు అందుబాటులో ఉంచుతారు. పాఠకునికి అందటమే సాహిత్యానికి పరమావధికదా!

చాలా బాధనిపించింది కాశికి... 'లేదు పొమ్మనవచ్చుగదా.

దేశం అడుక్కుతింటే తన కేమిటే... తన పొట్ట నిండాలి గాని...

ఇప్పుడు మాత్రం దేశం అడుక్కోకుండా తింటున్నదా?

ఇంతలో తడుముకుంటూ వాళ్లని చేరాడు ఎంకటేసు.

ముగ్గురూ ధర్మంచేసారు వాడికి'

చూసాడు కాశి... కడుపు మండింది.

మరి ముందుకు వెళ్ళలేదు...

వెనక్కి వచ్చి, స్టేషను చుట్టూ వున్న ఇనుప ఫెన్సింగును చూసాడు. సిమ్మెంటు స్తంభాలకి కొట్టివున్న ముళ్లతీగలు బాగా తుప్పుపట్టి వున్నాయి.

సిమెంటు స్తంభం దగ్గరగా వెళ్లాడు...


ఏడుపొచ్చింది...

కళ్లు మూసుకుని గట్టిగా సిమెంటు స్తంభాన్ని తన్నాడు.

'అబ్బా' అని మూలిగాడు బాధకి.

*        *        *

"సెప్టిక్ అయిపోయింది... ఇంజీషన్ను వాడాలి— పది రూపాయ లవుద్ది."



# ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

## ఆపద మొక్కులు

ఒకచోట ఒక మహాసభ జరిపేటప్పుడు ప్రారంభంలో దైవప్రార్ధనను చేయవలె నని ఒక వ్యక్తిని కోరగా "ఏమిటి ఇస్తారు?" అని ప్రశ్నించాడట! "దైవప్రార్ధనకు లంచం కావాలా ?" అని ప్రశ్నించగా "కష్టంలో ఉన్నప్పుడు దేవుణ్ణి ప్రార్ధించాలి. నాకే కష్టమూలేదు. నే నెందుకు ప్రార్ధించాలి?" అని సమాధాన మిచ్చాడట! ఈ జవాబు కొంత ఆశ్చర్యం కలిగిస్తున్నా – జరుగుతున్న సంగతి యింతే! సుఖంగా కాలం గడుస్తున్నప్పుడు దైవప్రార్ధన చేసేవారు తక్కువ. కష్టసమయంలోనే దేవుడు స్మరణకు వస్తాడు. ఈ కష్టాన్నుండి గట్టెక్కితే ఫలానా మొక్కుబడి చెల్లిస్తానని మొక్కుకుంటారు కూడా. భగవదనుగ్రహంవల్ల ఆ కష్టం నుంచి బయటపడిన తర్వాత ఆ భక్తి కొంత తగ్గుతుంది. ఎలాగో మొక్కుబడిని చెల్లించి, తన బాధ్యత తీరినదని తృప్తిపడడం జరుగుతుంది. మళ్లీ ఏదో అవసరం వస్తేనే మళ్లీ దేవుడు జ్ఞప్తికి వస్తాడు. వ్యక్తిని మంచి మార్గంలో ప్రవేశ పెట్టడానికే దేవుడు అతని కోరికను నెరవేర్చిన సంగతి స్మరణకు రాకపోవటం వింతే !

ఒకడు తన కోరిక నెరవేరితే తిరుపతి వేంకటేశ్వర స్వామికి హుండీలో తన వ్రేలి ఉంగరం ఇస్తానని మొక్కుకున్నాడు. కోరిక నెరవేరింది. కాని, ఆ మనిషికి ఆ ఉంగరం అంటే ఎంతో ఇష్టం. మొక్కుబడి చెల్లించాలి గదా ! అతడు ఆలోచించి, ఆ ఉంగరం విలువ పైకాన్ని మూటకట్టి హుండీలో వేసి, మొక్కుబడి తీర్చుకోవాలని నిశ్చయించాడు. హుండీలో ఆ పైకాన్ని పడవేస్తున్నప్పుడు, తన వేలికి బిగువుగా ఉన్న ఉంగరం కూడా జారి హుండీలో పడిపోయింది. దేవుణ్ణి మోసం చెయ్యదలిస్తే తానే మోసపోయాడు. ఈ విషయం చాలా మంది చెప్పుకుంటారు. ఇట్టి సంకుచితాభిప్రాయాలకు చోటు ఇవ్వకూడదు. ఆపత్కాలంలో మాత్రమే దేవుణ్ణి స్మరించడం, ఏమార్చదలచడం సరియైన పద్ధతి కాదు. అన్నిసమయాలలోను దైవధ్యానం, దైవప్రార్ధన మానవునికి కర్తవ్యమై ఉన్నది. అట్టి ప్రార్ధన మాత్రమే యధార్ధమైన ప్రార్ధన. దీనిని అందరూ గ్రహించవలసి ఉన్నది.

---

అంది— గవర్నమెంటువారి ఖరీదయిన (అ)ధర్మాసుపత్రి ఏర్మమ్మ— మనిషిని నమిలి పిప్పిని ఉమ్మే రాక్షసిలా— ఖారాకిళ్లీ పిప్పి ఉమ్ముతూ, గేటు దగ్గరే.

నగటు మానవుడికి మినిష్టరుగారి దర్శనం దొరకనట్టే, డాక్టరు మహాకాయం కనిపించలేదు కాశికి.

డాక్టరు లేనప్పుడు నర్సమ్మే పెద్ద డాక్టరని తెలును...

అయినా ఎందుకనో ఆమె సలహా ఇచ్చులేదు...

కుంటుకుంటూ ఇంటికొచ్చేసాడు, అదే— స్టేషనుకి, నిరాశగా.

నానా అవస్థలూ పడి డబ్బులు కూడ బెడుతున్నాడు, కాశి, అడుక్కుంటూ.

నెల రోజులు పోయాక అతి ప్రయాస మీద ఆస్పత్రి చేరాడు మళ్లీ.

ఏ వూరుకి వరదొచ్చిందో, డాక్టరుగారున్నారు!!

కాశిని చూసి, పెదవి విరిచారు.

ఇంతలో నర్సమ్మ వచ్చి కాశిని చూసి, గుర్తుపట్టింది.

"ఓరి పిచ్చిముండాకొడకా... గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకున్నావుగదరా. నీకసలు బతకాలని వుందా?" అని చిరాకు పడ్డది.

"ఉంది" అన్నాడు కాశి, ముక్తంగా,

"అప్పుడే యిండీషన్లు తీసుకుంటే మారాజులా బాగయ్యేది కదా, ఇన్నాళ్లు కుళ్లబెట్టావెందుకూ?"

"డబ్బుల్లేక" అబద్ధమాడాడు కాశి.

"పోనీ యిప్పుడున్నాయా?"

"ఎంతవుద్ది?"

"నగంకాలు తీసెయ్యాల... యాభై రూపాయలు పట్టా... మరి ఇంజీషన్లూ, రొట్టే, పాలూ బలమైన తిండీ పెట్టాలి గదా" అంది నర్సమ్మ.

"ఎప్పుడొచ్చిది?"

"పొద్దున్నే రా— డబ్బులెత్తి."

నర్సమ్మకి రెండు చేతులెత్తి దణ్ణం పెట్టాడు కాశి.

తనని కుష్ఠుదాన్ని చూసినట్టు చూస్తాడనుకున్నవాడు దణ్ణం పెట్టేసరికి ఉక్కిరిబిక్కిరైంది, నర్సమ్మ.

కాశి కళ్లనుంచి రెండు ఆనంద బాష్పాలు రాలాయి.

తమ సంగంలో చేరడానికి అర్హత సంపాదించుకున్నాడు.

తనూ జీవితంలో స్థిరపడుతున్నాడు!

ఆ ఆలోచన రాగానే ఓ గగుర్పాటు కలిగి మనస్సు, శరీరం తేలికైంది...

ఆ మధురానుభూతి రెండు కన్నీటి బొట్లు రాల్చింది.

అంతకంటే వాడి కింకేం కావాలి?

అది చాలు !

పరుగులాంటి కుంటి నడకతో స్టేషను వేపు దారి తీసాడు కాశి.